

కథా కౌముది

# బంగ్లాదేశ్ విముక్తిలో వెంకటసత్యస్టాలిన్ పాత్ర

మూలా రవికుమార్

వెంకట సత్య స్టాలిన్ జ్ఞాపకాల తేగలపాతర చదివేకా, శ్రీరమణ గారు మరచిపోయిన (బహుశాః ఆయనకి స్టాలిన్ చెప్పి ఉండడు) ఇంకో జ్ఞాపకాన్ని తెలియజేయటం నా కర్తవ్యంగా భావిస్తూ అతడి ముఖతాః నేను విన్నది, అతడి మాటల్లోనే మనవి చేసుకుంటున్నాను.

———————————

అది 1971, నవంబర్ చివర. కాశీ విశ్వేరుణ్ణి (ఎన్నోసారో లెక్క మరచిపోయాను) దర్శనం చేసుకొని తిరిగి వస్తూ హౌరాలో ఆంధ్రా వచ్చే రైలుకి మారాను.

మూడుగంటల్లో ఖరగ్‌పూర్ వచ్చింది. నా ప్రయాణం ఎంత రహస్యంగా ఉంచినా బయటకు పొక్కేసింది. అది తెలుగువాళ్ళు పెద్ద సంఖ్యలో స్థిరపడ్డ ఊరాయె. పైగా నా తిరుగు ప్రయాణ వివరం బెనారస్ హిందూ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ద్వారా ఐ.ఐ.టీ డైరెక్టరుకి లీకు అయింది. రైలు ఐదునిమిషాలు ఆగవలసినది అరగంట ఆపేసారు. ఐ.ఐ.టీ డైరెక్టరుకి ముఖాముఖి నాసలహాలు అవసరమైతే రైల్వేవాళ్ళని మొహమాటపెట్టి అరగంట ఆపేసారు.

నిజానికి నాకు మర్నాడే హైదరాబాదులో పీవీ గారిని (అప్పటికి ఆంధ్ర ముఖ్యమంత్రి) కలిసే పని లేకపోతే ఒక పూట ఖరగ్‌పూర్ లో ఆగేవాణ్ణే. ఆగితే ఒక బాధ కాదు. ఊళ్ళో ఉండమని అక్కడి తెలుగువాళ్ళూ, తమ గెస్టౌసులో ఉండమని ఐ.ఐ.టీ వాళ్ళూ. ఎవరో ఒకరి నిష్టూరం మూటకట్టుకోకుండా ఖరగ్‌పూర్ నుంచి బయటపడలేను.

ఇంతకీ రైలు అంతసేపు ఆపటం నా నిర్ణయం కాదు. మరెలా సాద్యం అంటారా? రైల్వే నిండా తెలుగు ఉద్యోగులే. ఐ.ఐ.టీ లో పనిచేసే తెలుగువాళ్ళకి తమ డైరెక్టరుగారికీ నాతో మీటింగ్ ఏర్పాటుచేసే అవకాశం ఎలా ఒదులుకుంటారు?

ఆ తెలుగువాళ్ళు ఈ తెలుగువాళ్ళని మొహమాటపెట్టేసారు. ఫలితం ట్రైనులో వాళ్ళంతా అరగట ఆగిపోయారు. డ్రైవరు లేటు కలిపెయ్యగల డు, ఆంధ్రా వెళ్ళేలోపల పంక్చువాలిటి మెయింటైన్ చెయ్యగలడు లెండి.

ఐ.ఐ.టీ లో కొత్తకోర్సులపై డైరెక్టరుగారికి నాకుతోచిన సలహాలు ఇచ్చి ఇలా కదిలామో లేదో, రెండు కిలోమీటర్లు వెళ్ళిన రైలు మళ్ళీ వెనక్కి వచ్చి ఖరగ్‌పూర్ ప్లాట్‌ఫారం మీద ఆగింది. ఎవరికీ ఏమీ అర్ధం కాలేదు. రైలు ఇలా వెనక్కి అంగుళం కదలాలన్నా అది డిల్లీ ఆదేశాలైనా ఉండాలి. లేదా బ్రేకు చెడిపోయైనా ఉండాలి. మా ముందు ట్రైనూ, మా తర్వాత ట్రైనూ మామూలుగానే వెళ్ళాయిట.

అప్పుడు మా పెట్టె దగ్గరికి మిలట్రీ వాళ్ళు వచ్చారు. అందులో ఒకడు నన్ను తేరిపార చూసి, "బెంకాట్ స్టోలిన్ సాబ్" అన్నాడు. అనటం ఏమిటీ, అరచినంత పని చేసారు. వెంటనే సాయుధులైన సైనికులు నాచుట్టూ గోడ కట్టేసి, నా లగేజీనీ నన్నూ దింపేసారు. ప్లాట్ ఫారం మీదకి నేరుగా వచ్చేసిన మిలట్రీ జీపులో నన్ను కూర్చోబెట్టారు. నిజానికి మంత్రులు రైలెక్కినపుడూ కూడా జీపులిని ప్లాట్‌ఫారం మీదికి తీసుకురారు.

నేను జీపులో కూర్చోగానే వైర్ లెస్ సెట్ ఆన్ చేసిన ఆఫీసరు, ఎవరితోనో "స్టోలిన్ సాబ్ మిల్ గయా సర్, హమారా జీప్ మే బైఠ్ గయా" అన్నాడు. అతడి గొంతులో నిధి దొరకబుచ్చుకున్నంత ఆనదం.

అటునుంచి, "నమస్తే స్టాలిన్ అంకుల్. మిమ్మలిని ఎందుకు ఇబ్బంది పెట్టాల్సి వచ్చిందంటే........" అని గంభీరంగా వినిపించింది. గొంతు గుర్తుపట్టాను, శ్యాం బాబు. అతడి హిందీలో నేపాలీ యాస ఉంటుంది. గూర్ఖా రెజిమెంటుతో అతడి అనుబంధం ఫలితం అది. శ్యాం బాబు అంటే మీకు తెలీదు. ఎందుకంటే పుస్తకాల్లో అతడిపేరుని మీరంతా ఫీల్డ్ మార్షల్ మానెక్ షా అని చదివి ఉంటారు. ఈ సంఘటన జరిగేనాటికి అతడుడి రేంకు జెనెరల్. భారత సైనికదళ అధిపతి. ఇంకా ఫీల్డ్ మార్షల్ అనే అరుదైన రేంకుకి వెళ్ళలేదు. యుద్ధసన్నాహాలు పర్యవేక్షించటానికి కలకత్తా వచ్చి ఉంటాడు

జీపు కదలటంతో, నేనే, "ఇంతహడావుడిగా ట్రైను వెనక్కి నడిపించి మరీ నన్ను దింపినది నువ్వా శ్యాం బాబూ. సరే వచ్చాకా మాట్లాడుదాం. జీపు రొదలో ఎందుకు?" అని చెప్పి సంభాషణ త్రుంచాను.

శ్యాం బాబుతో నా జ్ఞాపకాలు చుట్టుముట్టాయి. అప్పటికి నలభై ఏళ్ళ క్రితం నాటివి అవి. వాళ్ళది వ్యాపారస్తుల కుటుంబం. పార్సీలు తండ్రి మాత్రం వైద్యుడు. ఉప్పు సత్యాగ్రహం అప్పుడు శ్యాం బాబుకి పదహారేళ్ళు. తండ్రితో ఏదో మాట పట్టింపు వచ్చి, ఇంట్లో చెప్పకుండా సైన్యంలో చేరిపోయాడు. తండ్రీకొడుకులు ఎదురుపడి మాట్లాడూకుందికి ఏడాది పట్టింది. "నీకు నచ్చినట్టే చేస్తాను గానీ, మిలట్రీ వదిలెయ్" అంటాడు తండ్రి.

"అప్పట్లో అలిగి వెళ్ళినా, ఏడాది ట్రైనింగ్ అయ్యేసరికి నాకు సైన్యంలో చెయ్యాలని మనస్పూర్తిగానే అనిపించింది" అంటాడు కొడుకు.

అతడీ తండ్రి టాటా గారితో చెప్పించబోతే కొడూకు వినకపోతే, చివరిప్రయత్నంగా నన్ను పిల్చేరు. అడకత్తెర వ్యవహారం.

శ్యాం బాబుని తేరిపార చూసాను. అతడు డెహ్రాడూన్ లో పొందిన ఏడాది ట్రైనింగ్ మీద నాకు తెలిసిన మేరకు బొట్లేరుముక్కల్లో ఏవో నాలుగు మిలట్రీ ప్రశ్నలు అడిగితే, "ఇవన్నీ మా కమాండెంటు అడిగిన ప్రశ్నల్లా ఉన్నాయి" అని ఆశ్చర్యపోతూ శ్యాం బాబు సమాధానాలు చెప్పేడు. మధ్యలో అతడి సమాధానాలు కొన్ని నేను సరిచేసినా, పదిహేడేళ్ళ వయసుకి, ఇంకా యుద్ధరంగంలో ఒకరోజూ అనుభవం లేని బాలచంద్రుడి స్తాయికి చాలా ఎక్కువ అవగాహన తో ఉన్నాడు.

వెంటనే లోపలికి తీసుకెళ్ళి తండ్రితో ఏకాంతంగా చెప్పాను. "మీమీద అలిగి వెళ్ళినా, ఇదీ మంచిదే. మీ అబ్బాయి సానబెట్టిన వజ్రం. పోనుపోనూ ఇంకా ప్రకాశిస్తుంది. మరో వందేళ్ళతర్వాత కూడా దేశం మిమ్మలిని మానెక్‌షా తండ్రిగా గుర్తుపెట్టుకునే అంత పేరు తెచ్చుకుంటాడు." అన్నాను.

అతడి తండ్రి, "ఈ మాట మీరు తప్ప ఇంకెవరు చెప్పినా, ఆఖరుకి మా అబ్బాయికి ట్రైనింగ్ ఇచ్చిన కమాండెంట్ చెప్పినా నమ్మేవాణ్ణి కాదు"

అన్నాడు. అలా శ్యాం బాబు అలిగి వెళ్ళి మిలట్రీలో చేరినా అతడి తండ్రి ఆమోదం కోసం నాకు చేతనైనంది నేను చేసాను.

తర్వాత శ్యాం చెప్పేడు. "మీరు కూడా వద్దంటే మిలిట్రీ వదిలేద్దాం అనుకున్నాను అంకుల్" అని.

అక్కడితో అది ముగిసింది అనుకున్నానా? పదిహేనేళ్ళ తర్వాత మళ్ళీ శ్యాంబాబు తండ్రే కబురు. రెండో ప్రపంచ యుద్ధంలో శ్యాం బాబు చచ్చి బతికేడు. విరగగలిగే ప్రతీ ఎముకా విరిగి అతుక్కుంది. ఈ స్థితిలో ఇంటికొచ్చెయ్ అన్నా, ఇంక చాలు అన్నా వినకుండా మళ్ళీ సైన్యం లోనే కొనసాగుతానంటున్నాడుట.. అసలు నిఠారుగా నిలబడలేని వాడికి ఇంతపొగరు పనికిరాదు. అని తండ్రి అభిప్రాయం.

ఒక్కసారి శ్యాంబాబు వొళ్ళు తడిమి చూసాను. ఎముకలు అతుక్కోవటం అర్ధం అవుతోంది. అతడి తండ్రితో మళ్ళీ నాకు తోచింది చెప్పాను. "వీరుడిని కత్తిపోట్ల గుర్తులతో గుర్తించాలి. మీ వాడికి విరిగి అతుక్కున్న ప్రతీ ఎముకా ఒక ఉక్కుముక్క అతడి సంకల్పబలం అలానే ఉండనివ్వండి. అతడీ ఆత్మబలం ముందు ఈ గాయాలు దూదిపింజలు, మిలట్రీలోనే ఉండనివ్వండి" అన్నాను.

భారత్ లో కాశ్మీరు విలీనం జరగ్గానే, పాక్ సైన్యాలు ఉడుకుమోత్తనంతో బందిపోట్ల దాడిలా విరుచుకు పడ్డాయి. అప్పుడు అక్కడ పరిస్థితిని అంచనా వెయ్యటానికి కల్నల్ రేంకులో శ్యాం బాబునే శ్రీనగర్ పంపేరు. ఆ ఆపరేషన్ విజయవంతం కాగానే తనకి బ్రిగేడియర్ గా ప్రొమోషన్ వచ్చిందని నాకు చెప్తూ, "అంకుల్, పరిస్థితి అంచనా వెయ్యడానికి ఎవరిని పంపాలా అని మా చీఫ్ అయోమయంలో ఉన్నప్పుడూ మీరే నాపేరు చెప్పారుట కదా? మా చీఫ్ నాకు ఆపని అప్పగించటం వల్లే ఇంతచిన్న వయసులో బ్రిగేడియర్ అయ్యాను" అన్నాడు. శ్యాం బాబు గుర్తు చెయ్యకపోతే నాకు ఇవన్నీ గుర్తురావు. ముఖాముఖి కూర్చొన్న విషయాలే ఒకంతట గుర్తుండవు. ఫోనులో అడగటం, చెప్పటం ఎన్నని గుర్తు పెట్టుకోగలను?

ఆలోచనల్లో ఉండగానే జీపు ఆగటం, జీపుదగ్గర శ్యాం బాబు, అదే, జెనరల్ మానెక్ షా, నిఠారుగా నిలబడి అంకుల్ అనటం జరిగిపోయాయి.

టీ తాగాకా విషయం చెప్పేడు. తూర్పుపాకిస్తాన్ లో బెంగాలీలమీద పాకిస్తాన్ సైన్యం అరాచకాలు ఆపటానికి మన సైన్యం సరిహద్దులు దాటాలని అదేశాలుట. వెంటనే పంపటానికి చేతిలో పదివేలమంది సైనికులే ఉన్నారుట. ఒకవేళ ఇంకా ఎక్కువమంది సైనికులను పంపగలిగినా ఆహార సరఫరా, మందుగుండూ, నిల్వలూ పదివేలకి మించి సరఫరా ఇబ్బంది అవవచ్చునట. అక్కడ చూస్తే లక్షమంది పాకిస్తానీ సైనికులు ఉన్నారుట. యుద్ధం మొదలెట్టిన పదిరోజుల్లో ముగించలేకపోతే అమెరికా సైనికులో, చైనా సైనికులో వాళ్ళకి సాయంగా వచ్చే ప్రమాధం ఉందట. అదికాక అంతర్జాతీయ ఒత్తిడి పెరిగేలోపలే యుద్ధం ముగించి బంగ్లాదేస్ ని విముక్తి చెయాలిట. అందుకని పరిస్థితి స్వయంగా సమీక్షించటానికి నిన్ననే డిల్లీ నుండీ బయలుదేరి కలకత్తా వచాడుట. డిల్లీనుండీ బయలుదేరేటప్పుడే నేను గుర్తొచ్చానుట. కానీ ఫోనులో ఇలాంటి సలహాలు కుదరవు, అని నన్ను కలకత్తా రమ్మని పిలవటానికి ప్రయత్నిస్తూ ఉంటే నేను అప్పుడే ఖరగ్‌పూర్ వదిలినట్టూ తెలిసి, డీల్లీలో ప్రధానమంత్రి కార్యాలయంతో మాట్లాడి మరీ ఇలా ట్రైన్ వెనక్కి రప్పించాడుట.

రేపు పీవీ గారిని కలవటం కుదరదు. నొచ్చుకుంటాడు కానీ, ఇది దేశ రక్షణ వ్యవహారం. చెబితే అర్ధం చేసుకోకపోడు.

శ్యాం ఇచ్చిన మేపులూ, గూడచారి విభాగం ఇచ్చిన సమాచారం అంతా చూసి, కళ్ళు మూసుకొని చెప్పాను. శ్యాం బాబూ, శత్రువు వొళ్ళంతా వదిలి గుండెకి గురిపెట్టు. నీ వ్యూహ చతురతకి పదివేల సైనికులు నీకు చాలా ఎక్కువ అన్నాను.

అంతే, శ్యాం బాబు వెంటనే తన అప్పటికే ఏ మూలకి ఎంతమంది సైనికులిని పంపాలో రాసుకున్న కాగితం పరపరా చింపేసి, "ఢాకా తప్ప మరో చోటకి సైనికులు వెళ్ళొద్దు" అని రాసుకున్నాడు.

దెబ్బతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత తొలిసారిగా తొంబై వేలమంది సైనికులను లొంగిపోయేలా చేసి, ఆ రికార్డు యాబై ఏళ్ళైనా ఇంకో సైనికాధికారి బద్దలుకొట్టలేకపోయాడు.

తొలి ఫీల్డ్ మార్షల్ అయ్యాడు.

అతడు సైనికులకి, అందునా గూర్ఖాలకి, శ్యాం బహదూర్.

దేశానికి, ఫీల్డ్ మార్షల్ మానెక్ షా.

నాకు మాత్రం శ్యాం బాబే,

అప్పటికీ, ఇప్పటికీ, ఎప్పటికీ..

COMMENTS